# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 68 | పేజీలు: 4 | వెల: రూ.4/- | గురువారం 6 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి


## రైలు ఢీ కొని ఆరుగురు భక్తుల దుర్మరణం

లక్నో నవంబర్ 5 (నమస్తే ఉదయం)

ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో గల చునార్ రైల్వే స్టేషన్‌లో కల్కా మెయిల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని ఆరుగురు భక్తులు చనిపోయారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ప్లాట్‌ఫామ్ నెం.3 దగ్గర పలువురు యాత్రికులు పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీ కొనడంతో వారి శరీరాలు ఛిద్రమయ్యాయి.



# మహిళా క్రికెట్ జట్టుకు మోడీ ఆతిథ్యం

## క్రికెట్ విజేతలను అభినందించిన ప్రధాని

న్యూఢిల్లీ, నవంబర్ 5 (నమస్తే ఉదయం)

మహిళల వన్డే ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టును ప్రధాని మోడీ అభినందించారు. మీరు భారత పతాకను ఎగరేసారని ప్రశంసలు కురిపించారు. అసమాన ప్రతిభనుపరదర్శించారని ప్రశంసించారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీని మహిళా క్రికెట్ జట్టు కలిసింది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో టీమ్‌ఇండియాకు మోదీ ఆతిథ్యం ఇచ్చారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జట్టు సభ్యులు సాయంత్రం ప్రధాని నివాసానికి చేరుకున్నారు. వరల్డ్ కప్ విశేషాలను టీమ్ ఇండియా క్రీడాకారిణులు మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా

..మిగతా 2లో



# దమ్ముంటే రా..!

## అభివృద్ధిపై చర్చిద్దాం

### ఎవరి హయాంలో ఏం చేశామో వివరిద్దాం.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్



హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే ఉదయం)

హైదరాబాద్ అభివృద్ధి పై తనతో చర్చకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ అభివృద్ధి ఎవరి హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ, సచివాలయం, గాంధీ భవన్ ఎక్కడైనా సరే.. రేవంత్‌తో చర్చకు రెడీ అని ఛాలెంజ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరాశ, నిస్పృహతో ఉన్నారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌కు అర్థమైందని సెటైర్లు గుప్పించారు. అందుకే తనపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదని భావించి.. రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆయన కంటే గట్టిగా తాను మాట్లాడగలనని... రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పే సత్తా తనకు ఉందని స్పష్టం చేశారు. కానీ తమ అధినేత కేసీఆర్ సూచనల తోనే రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు తాను దిగటం లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని కేసీఆర్ తనకు చెప్పారని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించిన.. ముఖ్యమంత్రి హోదాలో ఉ న్నారు కాబట్టి రేవంత్‌రెడ్డిని తాను గౌరవిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. హోంశాఖను పర్యవేక్షిస్తున్న రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో గన్, డ్రగ్ కల్చర్ పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిందని విమర్శించారు. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వంద లింకు రోడ్లు

..మిగతా 2లో

# నేడు బీహార్‌లో తొలిదశ పోలింగ్

## భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

### 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ పోలింగ్



న్యూఢిల్లీ, నవంబర్ 5 (నమస్తే ఉదయం)

బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమరం కీలక ఘట్టానికి చేరుకుంది. నేటి తొలివడత పోలింగ్‌కు ఇసి పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో కేటాయించిన పోలింగ్ కేంద్రాకు ప్రత్యేక వాహనాల్లో చేరుకున్నారు. రెండు విడతల పోలింగ్‌లో భాగంగా తొలి విడత పోలింగ్ 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో గురువారం జరుగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలతో ముగుస్తుంది. కొన్ని నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మాత్రం ముందస్తు జాగ్రత్తగా సాయంత్రం 5 గంటలకే పోలింగ్ ముగుస్తుంది. తొలి విడత పోలింగ్ జరుగనున్న నియోజకవర్గాల్లో అందరి దృష్టి ప్రధానంగా వైశాలి జిల్లాలోని రఘోపూర్ అసెంబ్లీ నియోజకవర్గంపై ఉంది. ఇక్కడి నుంచి ఆర్జేడీ నుంచి 'మహాగర్‌బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ పోటీ

..మిగతా 2లో

# తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి



## సముద్రతీరాలు, నదీతీరాల్లో పుణ్యస్నానాలు

### ఆలయాల్లో శైవరాధన.. కార్తీక దీపాల వెలిగింపు

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే ఉదయం)

తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే సముద్ర, నదీస్నానాలు ఆచరించారు. దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదావరి, కృష్ణానదుల్లో స్నానం చేయడంతో పాటు, తీరప్రాంతాల్లో ఆలయాల్లో సందడి నెలకొంది. ఇకపోతే శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేసారు. శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము

..మిగతా 2లో

# మైనార్టీల మద్దతుతోనే కొడంగల్‌లో గెలిచా

## కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్

### కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి

### అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు నొప్పి

### జూబ్లీహిల్స్‌లో మరోమారు సీఎం రేవంత్ ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే ఉదయం)

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేట్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. భారత రాష్ట్ర సమితి పేరుతో భాజపా ఓట్లు అడుగుతోందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు బాధో చెప్పాలన్నారు. కిషన్‌రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదు. నిన్న నేను మాట్లాడిన మాటలను వక్రీకరించారు. మొదటి నుంచి నేను సెక్యులర్ భావాలు ఉన్న వ్యక్తిని. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు అనేక అవకాశాలు కల్పించింది. కొడంగల్‌లో నేను 3 సార్లు గెలవడానికి మైనార్టీల సహకారం ఉంది. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఇబ్బందులు లేకుండా చూశాం. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. ఎందుకు ఇవ్వొద్దో.. కిషన్‌రెడ్డి చెప్పాలన్నారు.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి ఏం ఇబ్బంది. ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ ఒక్కటేనన్నారు. ముస్లింలను భారత రాష్ట్ర సమితి మోసం చేస్తోంది. సవాల్ విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటుగా ఉంది. కేసీఆర్ పదేళ్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారా అని సీఎం ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ అభివృద్ధిపై చర్చలకు రావాలని సవాల్ విసిరారని.. ఆయనకు సవాల్

..మిగతా 2లో



# నేడు బీహార్‌లో తొలిదశ పోలింగ్

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నారు. రెండు సార్లు వరుసగా రఘోపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన హ్యాట్రిక్ విజయం కోసం బరిలో ఉన్నారు. గతంలో ఆ నియోజకర్గానికి తేజస్వి తండ్రి లాలూప్రసాద్ యాదవ్ రెండుసార్లు, తల్లి రబ్రీదేవి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఇద్దరూ రఘోపూర్ నుంచి గెలిచే ముఖ్యమంత్రులు అయ్యారు. మహూవా నియోజకవర్గం కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా ఏర్పాటు చేసిన 'జన్‌శక్తి జనతా దళ్' నుంచి పోటీ చేస్తున్నారు. ఈ ఏడాది మొదట్లో ఆర్జేడీ నుంచి తేజ్ ప్రతాప్ బహిష్కరణకు గురయ్యారు. ఇటీవల జన్‌సురాజ్ కార్యకర్త దులార్ చంద్ యాదవ్ హత్యకు గురైన మొకామా నియోజకవర్గంలోనూ ఓటర్లు ఎవరికి పట్టం కడతారనే ఆసక్తి నెలకొంది. ఈ హత్య కేసులో అరెస్టయిన అనంత్ సింగ్ మొకామా నుంచి జేడీయూ టిక్కెట్‌పై పోటీలో ఉన్నారు. ఆయన తరపున కేంద్ర మంత్రి లలన్ సింగ్ ప్రచారం చేశారు. కాగా, గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తారాపూర్ నియోజకవర్గం పైనా ఆసక్తి నెలకొంది. ఇక్కడి నుంచి ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి పోటీలో ఉన్నారు. గురువారం పోలింగ్ జరుగనున్న తొలి విడత ఎన్నికల్లో 1,314 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. 3.75 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 50,000కు పైగా పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.






మహిళల కోసం 1,000కు పైగా ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసింది. ఓటర్ ఐడీ కార్డు లేకపోతే ఆధార్, పాన్, పెన్షన్ కార్డు, డ్రైవర్ లైసెన్స్ వంటి 11 పత్రాలు ఉపయోగించుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. భద్రత కోసం పోలీసులు, కేంద్ర బలగాలతో కలిపి 50 వేల మందిని మోహరించింది. డ్రోన్లు, సీసీటీవీల పర్యవేక్షణలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల పోరు ప్రధానంగా ఎన్డీయే, ఇండియా కూటమి మధ్యనే ఉంటుందనే అంచనా ఉండగా, ప్రశాంత్ కిషోర్ జన్‌సురాజ్ పార్టీ కూడా అన్ని స్థానాల్లోనూ పోటీకి దిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 8 సభల్లో పాల్గొనగా, రాహుల్ 14 సభల్లో, నితీష్ 41 సభల్లో, తేజస్వి అత్యధికంగా 96 సభల్లో పాల్గొన్నారు. కాగా, రెండో విడత పోలింగ్ 122 నియోజకవర్గాల్లో నవంబర్ 11న జరుగనుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

## మహిళా క్రికెట్ జట్టుకు మోడీ ఆతిథ్యం

మొదటి పేజీ తరువాయి...

వరల్డ్ కప్ ఛాంపియన్లకు ప్రధాని అభినందనలు తెలిపారు. వరుసగా మూడు ఓటములు, సోషల్ మీడియాలో ఎదురైన ట్రోలింగ్‌ను సైతం ఎదుర్కొని గొప్ప విజేతగా నిలిచారంటూ ప్రశంసించారు. 2017 వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత్ చివరి వరకు పోరాడినా విజయం సాధించకలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు మిథాలీ రాజ్ నేతృత్వంలోని జట్టు నరేంద్ర మోదీని కలిసింది. తాజాగా ఆ విషయాన్ని ప్రధాని గుర్తు చేసుకున్నారు. అనంతరం భారత ప్లేయర్లు ప్రధానికి వరల్డ్ కప్ ట్రోఫీతోపాటు 'నమో 1' జెర్సీని అందజేశారు. ఈ సందర్భంగా వారితో ప్రధాని గ్రూప్ ఫోటో దిగారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



కీసర గుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న మాజీ మంత్రి మల్లారెడ్డి దంపతులు.

## పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలి:

### మాజీ మంత్రి ఎమ్మెల్యే,మల్లారెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( కీసర మున్సిపల్) ఆగస్టు 05 (నమస్తే ఉదయం): మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం కీసర గుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయం లో కార్తీక పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి దంపతులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి దీపా ఆరాధన చేసి స్వామివారికి అభిషేకం చేసి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ కీసరగుట్ట లో వెలసిన రామలింగేశ్వర స్వామి భక్తుల కొంగుబంగారంగా వెలుగొంజుతున్నారని అన్నారు. కార్తీక మాసంలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులతో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుందని చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజలను సల్లంగా చూడాలని రామలింగేశ్వర స్వామి ఆయన వేడుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలతో పాటు ఆశీర్వచనలు అందించారు.



## అల్వాల్‌లో భక్తులతో కిక్కిరిసిన పలు దేవాలయాలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (అల్వాల్ సర్కిల్) అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు దేవాలయాల్లో భక్తులతో సందడిగా మారింది. బుధవారం కార్తీక పౌర్ణమి శుభ సందర్భంగా పలు దేవాలయాలు శివాలయాలు భక్తులతో కితకితలు ఆడాయి. బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తి పారవేశాన్ని చాటుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈనెల 25 నుండి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. వంశపారంపర్య చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైన్చుర్, వెంకటరామిరెడ్డి, శివ రామ కృష్ణ ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు. అల్వాల్‌లోని ఉమా చంద్రమౌళీశ్వర ఆలయంలో భక్తులతో ప్రత్యేక దీపారాధన శివుని దర్శ నార్థం బారులు తీరారు. పోలీసు బందోబస్తు మధ్యలో స్పటిక లింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



## తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి

మొదటి పేజీ తరువాయి...

నుండే పాతాళగంగలో పుణ్య స్థానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం, ప్రత్యేక దర్శాన్నికి 2 గంటల సమయం పట్టింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. ఆలయాల్లో దీపాలు వెలిగించి, పూజలు, అభిషేకాలు చేసారు. వరంగల్ వేయిస్తంబాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. యాదాద్రి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో భక్తుల రద్దీ కనిపించింది. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. శివనామస్మరణంతో శివాలయాలు మారుమోగాయి. తెల్లవారుజాము నుండే అలయాలకు చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి, భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేసారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఝూరాసంగం కేతకి సంగమేశ్వర, సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసారు. మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిట లాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేస్తున్నారు. ధర్మపురి,బాసర, కాళేశ్వరంల వద్ద గోదావరి స్నానాలకు భక్తుల రద్దీ పెరిగింది. అనంతరం ఆలాయాల్లో దీపారాధాన చేపట్టారు.



## కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

విసరడం పారిపోవడం అలవాటేనని సెటైర్లు గుప్పించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తాను సవాల్ విసిరితే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో ఢిల్లీలో తేల్చుకోవాలని ఛాలెంజ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కిషన్‌రెడ్డి చెప్పాలని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో అసలు బీజేపీనే లేదని దెప్పిపొడిచారు. ఇక్కడ బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని పేర్కొన్నారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సెంటిమెంట్ పనికి రాదని విమర్శించారు. ఒకవేళ సెంటిమెంట్ అయితే పీజేఆర్‌పై పోటీ పెట్టింది బీఆర్ఎస్ కాదా..? అని అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌కి ఏం ఇచ్చిందని నిలదీశారు. కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అని అభివర్ణించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఉద్ఘాటించారు.

# దమ్ముంటే రా..!

మొదటి పేజీ తరువాయి...

నిర్మించామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం అంటే కటింగ్ మాస్టర్ మాదిరిగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ సిటీలో మళ్లీ తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ సర్కార్‌నేనని విమర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని నొక్కిచెప్పారు. మెట్రో నిర్మించిన ఎల్అండ్ టీని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఫ్లైల ఓవర్లు, అండర్‌పాసులు నిర్మించామన్నారు. రేవంత్ ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలనైనా పూడ్చిందా? అంటూ ప్రశ్నించారు.

హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేదెవరో ప్రజలందరికీ తెలుసునని, కాంగ్రెస్ హయాంలో మంచినీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను మురికికూపంగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో పవర్ హాలీడేలు విధించేవారని, కేసీఆర్

పాలనలో24గంటలు నాణ్యమైన కరెంట్ అందించామన్నారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ వెలుగులు నిండాయని, గ్రీన్ సిటీ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. 16వేల నర్సరీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సీయూలో జీవవైవిధ్యాన్ని నాశనం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదని అన్నారు. రేవంత్ బెదిరింపులకు ఎన్నో పరిశ్రమలు తరలిపోతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ దందాను పట్టుకున్నారని, రూ.12వేల డ్రగ్స్ దొరికితే పట్టింపులేదా?.. తెలంగాణ ముఖ్యమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి రిపోర్ట్‌ను ఇంటింటికీ పంపిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5,328 కోట్లు ఖర్చు చేశామని.. మెట్రోపై రూ.1,722 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. స్ఆర్‌డీపీ కింద రూ.333కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. ఎర్రగడ్డలో రూ.900 కోట్లతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించామన్నారు. వెయ్యి పడకలతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూంలు కట్టామని, రెహ్మత్‌నగర్‌లో కట్టిన 3600 డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేశామన్నారు. ప్రైవేట్ వాళ్లు కడితే ఒక్కో డబుల్ బెడ్‌రూంకు రూ.కోటి ఛార్జ్ చేసేవారన్నారు. ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మి కింద దాదాపు రూ.600 కోట్లు అందించామన్నారు. 106 మందికి దళితబంధు అందించామన్నారు. పండుగల కోసం 14కోట్లు అందించామని, అన్నపూర్ణ భోజనాల కోసం రూ.2కోట్లు చెల్లించినట్లు వివరించారు. మైనారిటీల కోసం 204 గురుకులాలను ఏర్పాటు చేశామని, రూ.51కోట్లతో గురుకులాలన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరబండలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.87కోట్లు ఖర్చు చేశామని, రూ.17కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. రూ.455 కోట్లతో పది సబ్‌స్టేషన్లను కట్టామని, జూబ్లీహిల్స్‌లో విద్యుత్ నిర్వహణ కోసం రూ.505కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేశామన్న కేటీఆర్.. రూ.180కోట్లు మంచినీటి కోసం ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చారు. పార్కుల నిర్వహణకు రూ.20కోట్లు, డీఆర్ఎఫ్ పెట్టి ప్రజలకు సహాయక చర్యలు అందించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5328 కోట్లు ఖర్చు చేస్తే.. రెండేళ్ల రేవంత్ పాలనలో ఎంత ఖర్చు చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధిని చూపించి రేవంత్ ఓట్లు అడగాలని, గోపీనాథ్ వేసిన శిలాఫలకం జూబ్లీహిల్స్‌లో ఎక్కడికి పోయినా కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు వచ్చాయని.. రేవంత్ పాలనలో ఎన్ని వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలే న్యాయనిర్ణేతలని.. జూబ్లీహిల్స్‌లో సరైన జవాబిస్తారన్నారు.





# స్పందించకుంటే వందలాది గాడిదలు, దున్నపోతులతో జనగామ జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తాం

**గానుగుపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి**

**జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**జనగామ - సిద్దిపేట జాతీయ రహదారి పై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా**

**ప్రభుత్వానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం**



ధర్నాలో పాల్గొన్న ప్రజలు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 05 (నమస్తే ఉదయం) : గానుగుపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జనగామ - సిద్ధిపేట జాతీయ రహదారి పై ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చౌరస్తాలో అక్రమంగా అరెస్టు చేసిన గానుగుపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జి సాధన సమితి కమిటీ సభ్యులను బే షరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనగామ - హుస్నాబాద్ ప్రధాన రహదారిలో బ్రిడ్జి పనులు గత రెండు సంవత్సరాలుగా నిలిచిపోయినందున తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చీటకోడూరు బ్రిడ్జి కూడా కూలిపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తూ గానుగుపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జిల సాధన సమితి కమిటీ సభ్యులు సోమవారం గాడిద పై మంత్రుల ఫోటోలు పెట్టి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేపట్టారన్నారు. ఈ ఆందోళన కార్యక్రమం పై జిల్లా ఆర్ అండ్ బి ప్రభుత్వ అధికారులు ఫిర్యాదు చేయడం సరైంది కాదని, అధికారుల పిర్యాదు మేరకు ధర్నాలో పాల్గొన్న సభ్యులపై పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్ పంపడం దారుణమన్నారు. అక్రమంగా అరెస్ట్ చేయడం పట్ల తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం ములాఖత్ ద్వారా అరెస్టై రిమాండ్ లో ఉన్న గానుగు పహాడ్, చీటకోడూరు బ్రిడ్జిల సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కర్ణాకర్ ఇతర నలుగురు సభ్యులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం తెలిపారు. అభివృద్ధి కోసం న్యాయమైన డిమాండ్లను అడగడాన్ని ప్రభుత్వం అణచివేయడం సరైన పద్దతి కాదని హెచ్చరించారు. అధికారులు, పోలీసులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానంపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని స్థానిక జిల్లా కలెక్టర్ గమనించి కూడా పట్టించు కోవట్లేదని ఎమ్మెల్యే, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జ్, రహదారి పనులు వెంటనే ప్రారంభించే వరకు తమ పోరాటం కొనసా గుతుందని, ప్రభుత్వానికి వారం రోజులు గడువు ఇస్తున్నామని, నిర్మాణ పనులు ప్రారంభించక పోతే వందలాది గాడిదలు, దున్న పోతులతో జనగామ కలెక్టరేట్ ముట్టడిస్తామని, అప్పుడు ఎంత మందిని అరెస్టు చేసి జైల్లో పెడతారు చూస్తామని, అవసరమైతే నేను కూడా జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గానుగుపహాడ్, చీటకోడూరు గ్రామాల ప్రజలతో పాటు బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్‌ను ఆశీర్వదించిన పాస్టర్లు

కూకట్ పల్లి, నవంబర్ 5 (నమస్తే ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ లోని అపోస్టోలిక్ ఫైర్ వర్షిప్ మినిస్ట్రీస్ చర్చిలో క్రిస్టియన్ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన శేరిలింగంపల్లి పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ క్రిస్టియన్ ఫెలోషిప్ సమావేశంలో పాస్టర్స్ అందరిని ఒకే వేదికమీద కలవడం ఆనందంగా ఉందని అన్నారు. విచ్చేసిన పాస్టర్లకు, సమావేశాన్ని ఏర్పాటుచేసిన నిర్వహికులకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశెట్టిగౌడ్, రాందాస్ గౌడ్, యాదగిరి, సంగమేష్, రాజుగౌడ్, పాస్టర్స్ శామ్యూల్ కోకిల, ఆర్.డి ప్రసాద్, టి.ఆర్.రాజు, ఎమ్. సత్యరాజు, నాగభూషణం, దేవదాస్, శామ్యూల్, ముకేశ్, కమలాకర్, జెర్మయ్య, నూతనబాబు, జాన్ ఆంథోనీ తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు

గద్వాల టౌన్, నవంబర్5(నమస్తే ఉదయం)జిల్లా కేంద్రంలో బైక్ అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. గద్వాల పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల కు చెందిన నాగరాజు(36), నరేష్(38) , కిరోష్ ముగ్గురు స్నేహితులు. బుధవారం జమ్మిచేడు జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరిగి గద్వాల టౌన్ కు వస్తున్న క్రమంలో గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో బైక్ అదుపుతప్పి డీవైడర్ ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నరేష్, నాగరాజు తీవ్రంగా గాయపడటంతో గద్వాల ఆసుపత్రి కి తరలించారు. అప్పటికే నాగరాజు, నరేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాద సంఘటనలో కిషోర్ స్వల్పంగా గాయపడాడు. బైక్ అతి వేగం లేదా మద్యం మత్తులో బైక్ నడపడంవల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆసుపత్రికి తరలించారు.

# వైభోవోపేతంగా కార్తీక పౌర్ణమి..

## కృష్ణానదిలో తెల్లవారుజామున స్నానం చేసిన భక్తులు



కృష్ణమ్మకు గంగా హారతి ఇస్తున్న పూజారులు

గద్వాల టౌన్, నవంబర్ 5(నమస్తే ఉదయం) కార్తీక పౌర్ణమి సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని శివాలయాలు, పుణ్యక్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. జిల్లాలోని కృష్ణ, తుంగభద్ర నదులలో మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను నదులలోకి వదిలారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలకు కార్తీక శోభ కార్తీక పౌర్ణమి



కార్తీక పౌర్ణమి జ్యోతి వెలిగిస్తున్న మహిళలు

మాసంలో వచ్చే పౌర్ణమిని హిందువులకు పరమ పవిత్రమైన రోజు. ఇది మహాశివరాత్రితో సమానమైన పుణ్యదినం.

కార్తీక పౌర్ణమి అటు శివునికి.. ఇటు విష్ణుమూర్తికి కూడా ప్రియమైన రోజు కావడంతో కార్తీకదీపం వెలిగిస్తే మనం తెలీక చేసే పాపాలన్నీ హరించుకుపోతాయి అన్ని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక మాసం అనగానే ముందుగానే చెప్పుకునేది దీపోత్సవం. ఈ మాసంలో భక్తులు దీపాలను వెలిగించడం అతి పవిత్రంగా భావిస్తారు. కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా నేత్రపర్వంగా జరిగాయి. ఆలయాలన్ని భక్తజనంతో కిక్కిరిసి కనిపించాయి. ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు, కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణా, తుంగభద్ర నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి, కార్తీక దీపాలను అరటిదొన్నెపై ఉంచి నదిలో వదిలి భక్తిప్రవత్తులు చాటుకున్నారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి వారికి నిర్వహించే వివిధ సేవల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయాల్లో భక్తులు పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేశారు. కృష్ణ, తుంగభద్ర నదీ పరివాహక బీచుపల్లి, అలంపూర్ పుణ్యక్షేత్రాలలో అర్చకుల ఆధ్వర్యంలో నదీహరతి వైభవోపేతంగా నిర్వహించారు.. కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాలు భక్తులతో కిటకటలాడాయి. నదీ తీర ప్రాంతాలలో ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రత్యేక వసతులు కల్పించారు.

కిక్కిరిసిన నదీ అగ్రహారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గద్వాల పట్టణంలోని నదీ అగ్రహారం వద్ద కృష్ణానదీ పుష్కరఘాట్ భక్తుల రద్దీ అధికంగా ఉంది. భక్తులు నదీలో పుణ్య స్నానాలాచరించి కార్తీకదీపాలు వెలిగించి నదిలోకి వదిలారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కృష్ణమ్మకు గంగాహారతీ**

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం గద్వాలలోని నదీ అగ్రహారం వద్ద దేవస్థానం అర్చకులు కృష్ణమ్మకు విశేష పూజలు నిర్వహించి గంగాహారతులు ఇచ్చారు. పౌర్ణమి సందర్భంగా సంప్రదాయం ప్రకారం పుణ్యనదీ హారతి, జ్వాలా తోరణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కృష్ణమ్మకు పూజలు చేసి గంగాహారతి పూజలో పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి సందర్భంగా కృష్ణానది వద్ద భక్తులు



## భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

గద్వాల టౌన్, నవంబర్ 5(నమస్తే ఉదయం) కార్తీక మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలో వివిధ గ్రామాలలో మహిళలు వారి నివాస గృహాల్లో బుధవారం తులసి మాతకు ప్రత్యేక పూజలు చేశారు తులసి మొక్కకు ప్రదక్షణ చేస్తే భూ ప్రదక్షణ చేసినంత పుణ్యమని భక్తుల ప్రగాఢ నమ్మకం తెలిపారు కార్తీక మాసం సందర్భంగా శివాలయంలోని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తెలంగాణ ప్రజల సాయుధ పోరాటంలో నల్ల నర్సింహులు మహోన్నత పోరాటం మరువలేనిది

**సిపిఐ దేవరుప్పుల మండల కార్యదర్శిజీడీ ఎల్లయ్య**




నల్ల నర్సింహులకు జోహార్లు అర్పిస్తున్న సిపిఐ నాయకులు

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 05(నమస్తే ఉదయం): తెలంగాణ ప్రజల సాయుధ పోరాటయోధుడు నల్ల నరసింహులు మహోన్నత పోరాటానికి నాయకత్వం వహించిన గొప్ప నాయకుడని సిపిఐ దేవరుప్పుల మండల కార్యదర్శి జీడీ ఎల్లయ్య అన్నారు.జిల్లా లోని దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామంలో తెలంగాణ ప్రజల సాయుధ పోరాట యోధుడు నల్ల నర్సింహులు 32 వ వర్ధంతి సందర్భంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం అయన స్మారక స్తూపానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీడీ ఎల్లయ్య మాట్లాడుతూ, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం.. సాగిన తెలంగాణ ప్రజల సాయుధ పోరాటంలో నల్ల నర్సింహులు గొప్ప పాత్ర నిర్వహించారని, దోపిడీకి గురవుతున్న ప్రజలను సమీకరించి దళాలను నిర్మాణం చేసి, మిలటరీ సైన్యాలను పోలీసు బలగాలను,భూస్వామ్య శక్తులను ఎదుర్కొన్నారన్నారు.నల్ల నరసింహులు ధైర్యసహసాలతో ఉద్యమాన్ని నిర్మించి శత్రువులకు సింహ స్వప్నంగా మారారని అన్నారు. ఈ ప్రాంతంలో పోరాటానికి నాయకత్వం వహించాడని ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు బెజగం ఎల్లయ్య, బిట్ల రామ సోక్కం,పడమటింటి కుమార్‌జీడి నవీన్, బిక్షపతి, తోట రవి పాల్గొన్నారు.




బీసీ సంఘం ఆధ్వర్యంలో నల్ల నరసింహులుకు నివాళులు

## బీసీ సంఘం జనగామ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో నల్ల నర్సింహులుకు ఘనంగా నివాళి


జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 05(నమస్తే ఉదయం): జిల్లా లోని దేవరప్పుల మండలం, కడవెండి గ్రామంలో బీసీ జనగామ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు విప్లవ సింహం నల్ల నరసింహులు 32వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన బీసీ జనగామ జిల్లా నాయకులు జేఏసీ దూడల సిద్దయ్య గౌడ్, జాయ మల్లేష్ కురుమ, డాక్టర్ మాచర్ల బిక్షపతి మాట్లాడుతూ "తెలంగాణ రైతాంగ హక్కుల కోసం ప్రాణాలు అర్పించిన నల్ల నరసింహులు బీసీల గౌరవం, రైతు హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పోరాడిన మహానుభావుడని, ఆయన చూపిన మార్గం ఈరోజు యువతకు స్ఫూర్తిదాయకమని. బీసీల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం నల్ల నరసింహులు త్యాగాలు మరువరాని అధ్యాయాలు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొలిపాక నరసింహులు, సంగి వెంకన్న, దొడ్డి భిక్షపతి, బెల్లి సోమయ్య, మల్లయ్య, నల్ల వీరస్వామి, బిట్ల రామచోక్కం, రేషపెల్లి కృష్ణ మూర్తి, మేడవేని సోమయ్య, కొంగళ్ళ యాకయ్య, సోమేష్, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు



## అనుమానస్పదంగా 27 గొర్రెలు మృత్యు వాత

గద్వాల జిల్లా ప్రతినిధి(గట్టు) నవంబర్ 5(నమస్తే ఉదయం) అనుమానస్పదంగా గొర్లు మృత్యువాత పడిన ఘటన బుధవారం గట్టు మండలంలో చోటు చేసుకుంది. గొర్లఖాన్ దొడ్డి గ్రామం కురువ తిప్పన్న, కురువ వెంకటన్న, కురువ ఈరన్న గొర్లకాపరులకు చెందిన గొర్రెలు గ్రామ శివారులో మేత మేస్తుండగా అకస్మికంగా మృత్యువాత పడ్డాయి దాదాపు 27 గొర్రెలు మృతి చెందాయి. మృతి చెందిన గొర్రెలను పశుసంవర్ధక అధికారి డాక్టర్ నవీన్ చంద్ పరిశీలించారు. విష ఆహారం తినడం వల్లనే గొర్రెలు మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి గొర్రెల కాపరులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

# సత్యం-శివం-సుందరం గౌ నివాస్ 25 ఏళ్ల సేవా యజ్ఞోత్సవం





### గౌశాల వెనుక ఉన్న 85 ఏళ్ల 'వన్ మాన్

రాజేంద్రనగర్, నవంబర్5(నమస్తే ఉదయం) బహుళులు వయసుతో మెల్లగిస్తే, 85 ఏళ్ల ధర్మ్రాజ్ రాంఖా మాత్రం సేవా యాత్రను మరింత వేగంగా కొనసాగిస్తున్నారు. ఒకప్పటి ప్రముఖ జువెలర్ అయిన ఆయన, దాతృత్వవేత్తగా మారి, గగనపహాడ్‌లోని సత్యం శివం సుందరం గౌ నివాస్‌లో 6,000కు పైగా ఆవులు, దూడలు, ఎద్దులు ఉన్న గౌశాల సంరక్షణలో నిరంతరం నిమగ్నమై ఉన్నారు. ఇది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద గౌశాలగా, దేశంలో అత్యంత శ్రద్ధగా నిర్వహించబడుతున్నదిగా గుర్తింపు పొందింది.

25 ఏళ్ల క్రితం ధర్మ్రాజ్ రాంఖా స్థాపించిన ఈ ఎనిమిది ఎకరాల ఆశ్రమం 80,000 చదరపు అడుగుల %=జజ% షెడ్లతో కూడిన సేవా కేంద్రం. ప్రతి ఆవును కుటుంబ సభ్యుల్లా చూసుకుంటారు. ఆవు పాలు దూడలకే ఉంచుతారు. ఎరువుగా ఉపయోగించే పేడను రైతులకు తక్కువ ధరకు ఇస్తారు. ఒక్కొక్క ఆవు తన జీవితాంతం గౌరవంగా జీవించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. నెలకు సుమారు □70 లక్షలు ఖర్చు చేస్తూ 100 మందికి పైగా కార్మికులు ఈ సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.వయసు మీద పడినా ధర్మ్రాజ్ రాంఖా ముందుండి నడిపిసస్తున్నారు . 25 ఏళ్ల క్రితం ఇచ్చుకున్న ప్రతిజ్ఞ ప్రకారం ఆయన చెప్పులు ధరించడం మానేశారు. ఈరోజు కూడా చెప్పులు లేకుండా" లేదా "నగ్న పాదాలతో" ఆటోలో తిరుగుతూ, భక్తులను, సేవకులను గౌ సేవా కార్యక్రమాలకు వ్యక్తిగతంగా ఆహ్వానిస్తారు. ఆయన వినమ్రత, శక్తి, భక్తి %-% ఇవన్నీ ఆయనను "స్వార్థరహిత సేవకు ప్రతీకగా" నిలబెట్టాయి.

"ఆవుల పరిరక్షణకు సేవ చేయడం అంటే మానవత్వాన్నే సేవించడం," అని నిశ్శబ్ద స్వరంతో, కానీ ఉత్సాహపూరితంగా రాంఖా చెబుతున్నారు.

సత్యం-శివం-సుందరం గౌ నివాస్ తన సిల్వర్ జూబిలీ వేడుకలను ఆధ్యాత్మికత, సంగీతం, సాంస్కృతిక కాంతులతో నిండిన ఉత్సవంగా జరుపుకోనుంది.

పంచకుండాత్మక చండీ హవనం ఉదయం 10:01 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1:30 వరకు జరుగుతుంది. ఈ హవనాన్ని ప.ప. పండిట్ శ్రీ హరిశ్చంద్రజీ కులకర్ణి ప.ప. 1008 శ్రీ సేవా రాంజీ (బాప్జీ మహారాజ్), రామనాథ్ ఆశ్రమం ఆశీర్వాదంతో నిర్వహిస్తారు.

అన్నకూట్ ప్రసాదం సేవ ఉదయం 11:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది.

కుమారి ఈషా జైన్ కతక్ నృత్య ప్రదర్శన మధ్యాహ్నం 1:45కు జరుగుతుంది.

మధ్యాహ్నం 3 గంటల నుండి భజన కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రముఖ గాయకులు మిస్ పూర్వా గురు (ఆల్ ఇండియా ఫేమ్ మాస్ట్రో), శ్రీ అరుణ్ ధాధీచీ (టి-సిరీస్ ఫేమ్), భజన్ సమ్రాట్ శ్రీ అరుణ్ దేవ్ గారు పాల్గొంటారు. వేలాది మంది భక్తులు, జంతు ప్రేమికులు, దాతలు ఈ పుణ్యోత్సవంలో పాల్గొననున్నారు.

"ఈ హవనం ఆధ్యాత్మిక శాంతికోసమే కాదు, కాలుష్యం వాతావరణ మార్పులపై మానవ జాతికి హెచ్చరిక ఇచ్చే ప్రయత్నం కూడా. ప్రకృతిని రక్షించడం నిజమైన పూజ అనే సందేశాన్ని ఈ పవిత్ర అగ్నిద్వారా ప్రజలకు చేరవేయాలనుకుంటున్నాం," అని రాంఖా తెలిపారు.అన్నకూట్ ఉత్సవం వెనుక ఉన్న భావం గురించి మాట్లాడుతూ, రాంఖా "అన్నకూట్ అంటే 'ఆహార పర్వతం'. ఇది కొత్త ప్రారంభాలను, భక్తిని సూచిస్తుంది. భక్తులు ప్రేమతో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను దేవుడికి సమర్పిస్తారు. అనంతరం ఆ ప్రసాదం అందరికీ పంచబడుతుంది." అని తెలిపారు.గగనపహాడ్‌లోని సత్యం శివం సుందరం గౌ నివాస్, బుర్జుగడ్డలోని సత్యం శివం సుందరం గౌకేంద్రం, ఆధునిక సౌకర్యాలు , ప్రాచీన దయాగుణాలను సమన్వయపరిచిన భారతదేశంలోని ఆదర్శ గౌశాలలుగా నిలుస్తున్నాయి.

ఇప్పటికీ రాంఖా 'వన్ మాన్ మూవ్‌మెంట్'గా గౌ సేవా ఉద్యమానికి ప్రేరణగా నిలుస్తున్నారు. హైదరాబాద్‌లో ఆయనను "బేర్‌ఫుట్ సెయింట్ ఆఫ్ హైదరాబాద్"గా ప్రేమతో పిలుస్తారు. ఒకప్పుడు విజయవంతమైన జువెలర్‌గా ఉన్న ఆయన, ఆవు సంరక్షణ కోసం జీవితాన్నే అర్పించారు.

శ్రీ రాంఖా శంషాబాద్ సమీపంలోని రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన "మా సరస్వతి వెటర్నరీ హాస్పిటల్" స్థాపనలోనూ కీలక పాత్ర పోషించారు. ఇది జంతు ప్రేమికుల విరాళాలతో నిర్మించబడింది. ఈ ఆసుపత్రి సంవత్సరానికి 3,000 శస్త్రచికిత్సలు, 40,000 కంటే ఎక్కువ జంతువుల వైద్యసేవలను అందించే సామర్థ్యం కలిగి ఉంది.



జాతీయ వరి పరిశోధనా సంస్థ.. డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం

# ఐఐఆర్ఆర్ లో నేడు రైస్ ఇండస్ట్రీ డే, ఎల్లుండి రైతు సమ్మేళనం

**బుద్వేల్, నవంబరు 5 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) లో ఈ నెల 6న రైస్ ఇండస్ట్రీ డే, 7వ తేదీన రైతు సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం జరిగే ఇండస్ట్రీ మీట్ లో వరి శాస్త్రవేత్తలు, సీడ్ కంపెనీల ప్రతినిధులు, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారు. దేశానికి కావాల్సిన వరి రకాలు, మిల్లర్స్ కు అనువైన రకాలు, ఎగుమతులుకు డిమాండ్ ఉన్న వరి రకాల గురించి ఈ సందర్బంగా చర్చించడం జరుగుతుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇండస్ట్రీ మీట్ ఉంటుందని ఐఐఆర్అర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తెలిపారు. ముందుగా సీడ్ కంపెనీల ప్రతినిధులు, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో కలసి వరి పొలాలను క్షేత్ర స్థాయి లో పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత దీఐఆర్అర్ ద్వారా చేపడుతున్న పరిశోధనలు. కనుగొన్న రకాలను ప్రదర్శనలో ఉంచడం జరుగుతుందన్నారు. ఐఐఆర్ఆర్ ద్వారా దేశానికి, రైతులకు, ప్రజలకు అందుతున్న సేవల గురించి వివరించడం జరుగుతుందని తెలిపారు.

**ఈ నెల 7న రైతు సమ్మేళనం :**

ఈ నెల 7వ తేదీన రాజేంద్రనగర్ లోని ఐఐఆర్ఆర్ లో రైతు సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తెలిపారు. రైతులకు వరి పొలాలను చూపించడం. ఏ రకం ఎంత మేర పండుతుందో వివరించడం, ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో అని తెలియజేయడం జరుగుందన్నారు. అనంతరం రైతులు అగిగే ప్రశ్నలకు శాస్త్రవేత్తల ద్వారా సమాదానాలు చెప్పించడం జరుగుతుందన్నారు.

# ఎర్రబోడ అర్ధరాత్రి మద్యం మత్తులో యువకుల వీరంగం

### పార్కు చేసిన కారు అద్దాల ధ్వంసం



ధ్వంసమైన తన కారు అద్దాలను చూపుతున్న రాజు

బుద్వేల్, నవంబరు 5 (నమస్తే ఉదయం): అర్ధరాత్రి మద్యం మత్తులో కారు అద్దాలను ద్వం సం చేసిన ఐదుగురు యువకులపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. హైదర్ గూడ ఎర్రబోడ ప్రాంతానికి చెందిన రాజు అనే వ్యక్తి తన స్విఫ్ట్ డిజైర్ కారు (టీఎస్08ఎఫ్ఎ 0801) ను తన ఇంటి ముందు పార్కు చేశాడు. మంగళవారం అర్ధరాత్రి 1:20 గంటల కు అదే ప్రాంతానికి చెందిన కె గోవింద్ (21), బి.నరేశ్ (25), జె అఖిల్ (19), జి.క్రాంతి కుమార్ అలియాస్ లక్కి (19), శంకర్ (20) లు మద్యం సేవించి కారు అద్దాలను ధ్వంసం చేశారు. కారు అద్దాలు ధ్వంసం అయిన శబ్దం విని రాజు బయటకు వచ్చి చూడగా మద్యం మత్తులో ఉన్న ఐదుగురు యువకులు కారు అద్దాలు పగులగొట్టడం కనిపిం చింది. అదేంటని ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడారని రాజు తెలిపాడు. బుధవారం ఉదయం రాజు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. గంజాయి సేవించి తన కారు ఆదాలను పగులగొట్టారని రాజు మీడియా కు చెప్పారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐదుగురు యువకులను అరెస్ట్ చేసి వారికి గంజాయి టెస్టు చేశారు. అయితే వారు గంజాయి సేవిం చినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదు. మద్యం మత్తులో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు వారిపై 324(4), 351(2) సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేశారు.



శ్రీ పంచాయతన శక్తీ పీఠం లో కొలువు దీరిన దేవతామూర్తులు.. తులసి చెట్టు

# కార్తీక పౌర్ణమి సందర్భంగా దేవాలయాలలో ప్రత్యేక పూజలు

బుద్వేల్, నవంబరు 5 (నమస్తే ఉదయం) : కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాలలో భక్తులు దీపారాధనలు చేశారు. ప్రగతి కాలనీలోని శ్రీ పంచాయతన శక్తీ పీఠం లో కొలువుదీరిన సపరివార శ్రీ సత్య శివ సుందరేశ్వర స్వామి, క్షేత్ర పాలక శక్తినేత్ర శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి కి అభిషేకాలు నిర్వహించారు. శ్రీ పంచాయతన శక్తీ పీఠం పీఠాధిపతి రమాకాంత శర్మ అధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.

# శ్రీ కృష్ణ దేవరాయ కాపు యువసేన విద్యార్థులకు ఆర్థిక సహాయం

### అందజేసిన జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



కూకట్ పల్లి, నవంబర్ 5 (నమస్తే ఉదయం) శ్రీకృష్ణ దేవరాయ కాపు యువసేన ఆధ్వర్యంలో ఏడిద సుబ్రహ్మణ్యం, మణి దంపతుల కుమారుడు పవనకుమార్, కుమార్తె దీపిక విద్యాభ్యాసం కొరకై 20 వేల రూపాయలు కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ చేతులమీదుగా వారి నివాసం లో అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మట్లాడుతు సేవ దృక్పదం తో ఎస్ కే డి కె యువసేన గత కొని సంవత్సరాలు గా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యువసేన సభ్యులు యల్. రాజ, గోగిశెట్టి భాస్కర్, బావిశెట్టి గోపి, హెచ్ ఎన్.చైతన్య, జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



# వనభోజన మహోత్సవానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్‌ను ఆహ్వానించిన ఏఎంసీ డాక్టర్ మధు

కూకట్‌పల్లి,నవంబర్ 5 (నమస్తే ఉదయం)కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి డివిజన్ కమ్మ సంఘం ఆధ్వర్యంలో కూకట్ పల్లి ఇంచార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు కమ్మ సంఘాలకు కన్వీనర్ బండి రమేష్ కి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ (స్టేట్ వారెహౌసెస్ చైర్మన్) రాయల్ నాగేశ్వరావు, బిక్కసారి నాగేశ్వర్ కి మన సంఘ సభ్యులకు ఏ.ఎం.సి డాక్టర్ మధు, పిన్నమనేని రాధాకృష్ణ, నిమ్మగడ్డ తిలక్, కిలారి శ్రీనివాస్ బాబు, గాదెల అనిల్ కుమార్, వేజెండ్ల కిషోర్, కందుల సందీప్ కలిసి డివిజన్ లో జరగబోయే వనభోజనం మహోత్సవముకు ఆహ్వానించారు.



# పేదలకు గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి శ్రీధర్ బాబు

రంగారెడ్డి జిల్లా. నవంబర్ 5(నమస్తే ఉదయం) ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చాలని ఉద్దేశంతో ఇందిరమ్మండ్ల పథకాన్ని చేపట్టి అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, ఈ జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.బుధవారం మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గంలో మంఖాల్ %×డ ××% 2848 నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ , జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గతంలో కోర్టు కేసు ఉండటం వలన మంఖాల్-%×% , మంఖాల్-%××% డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం ఆగిపోయిందని కోర్టులో కేసు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వం , జిల్లా యంత్రాంగం చొరవ తీసుకొవడం జరిగిందని, పెండింగ్ లో ఉన్న 2848 మందికి డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ఈరోజు అందించడం జరుగుతుందని తెలిపారు. నిజమైన ఇల్లు లేని నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేర్చే ఉద్దేశంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించడం జరుగుతుందని ఆయన అన్నారు.అన్ని సౌకర్యాలు కల్పించి డబల్ బెడ్ రూమ్ లె ఇండ్లను మీకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చాంప్లానాయక్ కందుకూరు ఆర్ డి ఓ కే జగదీశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులు జిల్లా నాయకులు కేఎల్ఆర్ , తదితరులు పాల్గొన్నారు.



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యం

### మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ

గండిపేట,నవంబర్05(నమస్తే ఉదయం):రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ తగ్గుతుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు.జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ...బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజలు ఆసక్తిగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అఖండ మెజారిటీతో గెలుపొందడం తథ్యమ న్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి శ్రమిస్తున్నారని వివరించారు. ప్రధానంగా నియోజకవర్గం పరిధిలోని షేక్ పేట డివిజన్ బూత్ నంబర్ 24నుండి 30 వరకు బాధ్యతలను నిర్వహిస్తున్న యువనాయకుడు రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి పట్లొల్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగల్ల ధనరాజ్,ముఖ్య కార్యదర్శి గుట్టమీది నరేందర్,ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు,షేక్ ఆరీఫ్,యాలాలకిరణ్, ఎం.బాబురావు,స్థానికనాయకులుమల్లికార్జున్,రవికుమార్,ఫయాజ్,విగ్నేష్,వాసవి,స్వప్న,అంకమ్మ,రాధిక,పుష్ప,అశోక్,రేఖా,ప్రభు,వెంకటేశ్,రాములు,కృష్ణా,యాదగిరి,ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

# ఘనంగా శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాలు

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 05(నమస్తే ఉదయం): జిల్లా లోని రఘునాథపల్లి మండలం, ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి సందర్భంగా బుధవారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ సేవా కార్యక్రమాన్ని కాంటేవాడ రాధా-బుగ్గాజి దంపతులు ఘనంగా నిర్వహించారు, అలాగే వారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరైతే ప్రజలకు సేవ కార్యక్రమాలు ఎటువంటి స్వార్థపూరితం లేకుండా నిర్వహిస్తారో వారు సమాజంలో దేవుడిగా కీర్తించబడతారని, అదే ఉద్దేశంతో శ్రీ సత్య సాయి బాబా ఎన్నో సేవా కార్యక్రమాలు ఈ సమాజానికి అందించారు కాబట్టి వారు ఈ జగతికి దైవంగా పూజింపబడ్డారు కాబట్టి వారి అడుగుజాడల్లోనే మనం కూడా నడవాలని తెలిపారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక తహసీల్దార్ ఫణి కిశోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు , స్పెషల్ ఆఫీసర్ బి. భరత్ , పంచాయతీ కార్యదర్శి నాజియా తబస్సుమ్ , గ్రామ తాజా మాజీ సర్పంచ్ మాధవి మధు, సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు సిహెచ్. జీవన్, శ్రీసత్యసాయి సేవాసంస్థల. జిల్లా ఇన్‌చార్జ్ బి. రవి, కన్వీనర్ రమేష్, జిల్లా మహిళా సేవా సమన్వయకర్త కాంటేవాడ రాధ -బుగ్గాజీ , జిల్లా యువ సమన్వయ కర్త బాలనరసింహచారి, గ్రామ పెద్దలు దీగోజు సాంబ చారి, బైరగోని బాలరాజు గౌడ్, గంపల నరసయ్య, పెంతల ఎల్లారెడ్డి, అనుముల రామచందర్, ఆలేటి సాంబారావు, పర్వత సుమన్ రావు, శ్రీ సత్య సాయి సేవా సంస్థల సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భగవాన్ సత్యసాయి బాబా బోధించిన " అందరినీ ప్రేమించు-అందరికీ సేవ చేయండి" అనే సేవా సూత్రాలను గుర్తు చేసుకున్నారు. సిద్ధాంతాలను స్మరించుకున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733